# సింగిల్ పేజీ కథలు

## అత్తా-కోడలు

**"అమ్మా! ఈ హడావుడి అంతా ఏంటమ్మా?" ఆశ్చర్యంగా అన్నాడు మధు.**

**"శాంతొస్తుందిరా మనింటికి, శాంత"**

**"అమ్మా!" ఆశ్చర్యానందాలతో తల్లి వైపు చూశాడు మధు. "నిజంగా శాంత వస్తుంది రా"**

''అమ్మా, శాంత మీద నీకు కోపం లేదా?''

''పిచ్చిపిల్ల, ఆ అమ్మాయి మీద నాకు కోపమేంటిరా, చిన్నపిల్ల నన్ను కాక ఇంకెవర్నంటుంది



ఏమైనా? మనసులో ఏదైనా బాధ కలిగితే నాతో నేగా చెప్పుకోవాలి?''

''తను చెప్పుకుందా, గొడవ కదూ పెట్టుకుంది''

''చిన్నపిల్ల కదా, అనుభవం తక్కువ, ఆవేశం ఎక్కువ''

'అమ్మ ఎంత మంచిది, శాంత వచ్చేస్తుందంటే తనకెంత ఆనందంగా ఉందో. రాగానే కౌగిలింతలు, ముద్దులు' ఊహల్లో తేలిపోయాడు మధు.

''మధూ, నీకింకో గుడ్ న్యూస్‌రా. శాంత ఇప్పుడు వుట్టి శాంత కాదు, శాంత ఐ.ఎ.ఎస్.''

''అమ్మా... ఇది నిజమా? ఇప్పటిదాకా నాకీ విషయం తెలపలేదే నీకెలా తెలిసింది?''

''మీ మామగారు నాకు తరుచూ లెటర్స్ రాసేవారురా. అలా తెలిసింది... ఆనందం తర్వాతగానీ ముందు స్టేషన్‌కి వెళ్లి శాంతను తీసుకురా'' కొడుకుతో అంది మీనాక్షి.

కొడుకు వెళ్లగానే గతంలోకి మరలాయి ఆమె ఆలోచనలు. శాంత పెద్దింటి అమ్మాయి. కొడుకు ప్రేమించి పెళ్లి చేసుకుంటాననేసరికి తనేం అడ్డు చెప్పలేకపోయింది.

శాంత మధ్యతరగతి ఇంట్లో ఇమడలేకపోయింది. అటు భర్తను వదులుకోలేక, ఇటు పుట్టింటికి వెళ్లలేక పొద్దస్తమానం అత్తగారితో వాళ్ల లేమిని గురించి పోట్లాట పెట్టుకునేది.

ఒకరోజు పక్కింటి అమ్మాయి రవ్వల నెక్లెస్ తెచ్చి శాంతకు చూపించింది.

''చాలా బాగుంది. ఖరీదెంతో'' అడిగింది శాంత.

''ఏభై వేలు. నువ్వు కూడా ఈ మోడల్‌తో చేయించుకోరాదూ...'' అందామె.

అటుగా వస్తున్న అత్తగారిని చూసి ఏడిపించాలని ''హు... ఈ ఇంట్లో పడ్డాకా రవ్వల నెక్లెస్ కేంటి, మామూలు నెక్లెస్‌కి కూడా గతి లేదు'' పుల్లవిరుపు మాటలాడింది శాంత.

అప్పుడేం మాట్లాడకుండా ఆ అమ్మాయి వెళ్లిపోయాకా అంది మీనాక్షి. ''శాంతా! మనకున్న దాంట్లో మనం తృప్తిగా బ్రతకాలి. పరాయి వ్యక్తుల దగ్గర మనల్ని మనం ఎందుకు చులకన చేసుకోవడం?''

''నేను మిమ్మల్ని అనలేదు'' పెడసరంగా అంది శాంత.

''శాంతా! ఇది మొదటిసారి కాదు నువ్విలా నన్ను మభ్యపెట్టడం. రోజూ ఆ అమ్మాయి ఏదో ఒకటి తెచ్చి చూపించడం, నువ్వు నీ మెట్టినింటి గురించి పుల్లవిరుపు మాటలు మాట్లాడడం. ఆ అమ్మాయి అమ్మ ఎంత గొప్పదో నీకు తెలుసా? సివిల్ సర్వీసెస్ రాసి రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కమీషర్‌గా పనిచేస్తుంది. తల్లిదండ్రి సంపాదిస్తుంటే ఆ అమ్మాయి ఇలా ఖర్చు చేస్తుంది. రేపు ఆ అమ్మాయి కూడా నీలా మధ్య తరగతి ఇంటికి కోడలుగా వెళ్లొచ్చు. ఈరోజు ఇలా ఉన్నాం... రేపెలా ఉంటామో ఎవరం చెప్పగలం?''

''ఇంతకీ నువ్వు ఇప్పుడు గడుపుతున్న జీవితం మీద అసంతృప్తి పెంచుకుంటున్నావ్, అది నీకు కానీ ఈ ఇంట్లో వాళ్లకి కానీ ఏ విధంగా మంచి చెయ్యదు. నువ్వూ ఖాళీగా వుండి, ఇలా లేనిపోని ఆలోచనలతో మైండ్ పాడుచేసుకునే కంటే ఏవైనా కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాయొచ్చుగా''

''అంటే నేను సంపాదించి తెచ్చి పెడ్తే మీరు తింటారా? ఇదా మీ అసలు స్వరూపం?'' కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ పెద్ద గొడవేసుకుంది శాంత.

''అబ్బే నా ఉద్దేశం అది కాదమ్మా! ఏదో ఇంటిని సవరించడానికి నేనున్నాగా. ప్రశాంతంగా ఆలోచించి నువ్వు ఎదగడానికి నేను తోడ్పడదామని...''

''ఛ... ఈ ఇంట్లో మీ గొడవ నేను పడలేకపోతున్నాను. నేనిప్పుడే మా ఊరెళ్లిపోతాను'' అలిగి వెళ్లిపోయింది శాంత. అత్తగారు ఎంత బ్రతిమిలాడినా వినలేదు.

'అలా వెళ్లడం మళ్లీ ఇప్పుడే రావడం. శాంత తనతో ఎలా ప్రవర్తిస్తుందో?' దిగులుగా ఉంది మీనాక్షికి.

వాకిట్లో చప్పుడైంది. శాంత మధుతో వస్తోంది. ఒక రకమైన ఠీవితో, హుందాగా నడుస్తున్న శాంతను చూడడానికి రెండు కళ్ళు చాలట్లేదు మీనాక్షికి.

తనవైపు చిరునవ్వుతో చూస్తున్న శాంతను ''క్షమించమ్మా! నిన్నారోజు అనరాని మాటలన్నాను. అదంతా నీ మంచికోసమే..'' అని ఏదో చెప్పబోయిన అత్తగారిని వారించి ఆమె కాళ్లకు నమస్కరించింది శాంత.

విద్యతోపాటు వినయాన్ని పెంచుకున్న కోడల్ని ఆప్యాయంగా లేవదీసి గుండెలకి హత్తుకుంది మీనాక్షి.

**-కె. లలితారాజ్ (ఒంగోలు)**